కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

# BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -180 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 12-07-2026 ఆదివారం పేజీలు : 4

# అన్నదాతకు షాక్
## రైతు బీమాపై సందిగ్ధం

రైతు బీమాపై అనిశ్చితి
ఇందిరమ్మ బీమాకు సన్నాహాలు
రేషన్ కార్డు కుటుంబాలకే వర్తింపు?
కుటుంబ పెద్దకే రూ.5 లక్షల బీమా
ఆగస్టు 14తో రైతు బీమా గడువు
నాలుగు నెలల గ్యాప్‌పై ఆందోళన
రైతు సంఘాల నుంచి కొనసాగింపు డిమాండ్
ప్రభుత్వ నిర్ణయంపై ఉత్కంఠ



**న్యూస్ డెస్క్, 11 జూలై (బిఎన్ఎస్):** అన్నదాతలకు కొండంత అండగా నిలుస్తున్న రైతుబీమా పథకం కనుమరుగవుతుందనే ప్రచారం జరుగుతోంది. కొత్తగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రభుత్వం అమలు చేసేందుకు ప్లాన్?చేస్తోంది. నవంబర్?19న ఇందిరా గాంధీ జయంతి రోజున పథకానికి శ్రీకారం చుట్టనుండగా ఇప్పటికే పథకానికి సంబంధించిన విధి విధానాలు సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. 2018లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఏటా 25 వేల కుటుంబాలకు పరిహారం అందుతుంది. రైతులపై భారం పడకుండా ప్రభుత్వం ప్రీమియం ఏటా ఆగస్టు 14న చెల్లిస్తోంది. పథకం ప్రారంభంలో 31.25 లక్షల మంది అర్హులు ఉండగా ప్రస్తుత ఏడాదిలో 42.16 లక్షల మందికి వర్తిస్తోంది. అయితే ఈ పథకంలో ఏటా కొత్తగా చేరే రైతులకంటే అనర్హుల తొలగింపు, మరణించే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ప్రతి ఏటా 59 ఏళ్లుపైబడిన రైతులు పథకానికి దూరమవుతుండగా భూమి పంపకాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ఇక రైతు ఆకస్మాత్తుగా మరణిస్తే కుటుంబానికి రూ.5 లక్షల బీమాను కేసీఆర్ అమలు చేయగా ఈ పథకం రద్దు చేయకుండా పాత పద్ధతిలోనే కొనసాగించాలని రైతు సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం ఏటా బీమా కోసం చెల్లిస్తున్న ప్రీమియంలో 70 శాతం చెల్లింపుకు సరిపోగా 30 శాతం మిగులుతుంది.

ఇందిరమ్మ బీమా..

రాష్ట్రం ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించేందుకు కసరత్తు వేగవంతం చేసింది. వివిధ కారణాలతో కుటుంబ పెద్ద మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం చెల్లించనుంది. రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు కుటుంబ జీవిత బీమా అమలు చేస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. దీనికోసం బడ్జెట్ లో రూ.4వేల కోట్లు కూడా కేటాయించారు. ఇందిరమ్మ బీమా పథకం కుటుంబంలో కేవలం ఒక్కరికే వర్తిస్తోంది. అది కూడా కుటుంబ పెద్దకు మాత్రమే వర్తించేలా ఈ పథకాన్ని రూపొందిస్తున్నట్టు, రేషన్‌కార్డు కలిగిన వారికి మాత్రమే అమలు చేయనున్నట్టు తెలిసింది. రైతుబీమా పథకం కుటుంబంలో భూమి ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తిస్తుంది.

మిగతాది 2 లో..

# హరీశ్‌పై బరిలోకి జగ్గారెడ్డి

అధిష్టానం ఆదేశిస్తే పోటీ
సంగారెడ్డిలో నిర్మలకే టికెట్
యాక్టివ్ కానివారికి హెచ్చరిక
కాంగ్రెస్-బీఆర్ఎస్ మాటల యుద్ధం




**న్యూస్ డెస్క్, 11 జూలై (బిఎన్ఎస్):** తెలంగాణలో సవాళ్ల రాజకీయం వేడెక్కింది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య డైలాగ్ వార్ ముదురుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య నువ్వా నేనా అన్నట్లు రాజకీయం సాగుతున్న వేళ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో మాజీ మంత్రి హరీశ్ రావుపై పోటీ చేసేందుకు సిద్ధమేనని ప్రకటించారు. శనివారం మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన జగ్గారెడ్డి.. అధిష్టానం ఆదేశిస్తే హరీశ్ రావుపై పోటీ చేస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో సంగారెడ్డిలో తాను పోటీ చేయబోవడం లేదని చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. నేను సంగారెడ్డిలో మాత్రమే పోటీ చేయనన్నానని చెప్పానని కానీ వేరే చోట పోటీ చేయను అనలేదు కదా అన్నారు. నేను ఎక్కడ పోటీ చేయాలో పార్టీ నిర్ణయిస్తుందన్నారు.

# 1000 క్షిపణులు సిద్ధం
## ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్




హత్యాయత్నం జరిగితే సర్వనాశనమే
'ట్రూత్ సోషల్‌'లో ట్రంప్ సంచలన పోస్ట్
ఇరాన్‌పై భారీ ప్రతీకారానికి అమెరికా సిద్ధం

# బ్యాంకుల్లో డిపాజిట్ల వెల్లువ

15 రోజుల్లో రూ.7 లక్షల కోట్లు
29 ఏళ్లలో మూడో అతిపెద్ద రికార్డు
రూ.219.78 లక్షల కోట్లకు డిపాజిట్లు
రుణాల్లోనూ భారీ పెరుగుదల
రికార్డు వెనుక కార్పొరేట్ నిధులు




**న్యూస్ డెస్క్, 11 జూలై (బిఎన్ఎస్):** భారత బ్యాంకింగ్ రంగ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా డిపాజిట్లు వెల్లువెత్తాయి. దేశంలోని వాణిజ్య బ్యాంకుల్లో కేవలం 2 వారాల వ్యవధిలోనే ఏకంగా 7 లక్షల కోట్ల రూపాయల డిపాజిట్లు వచ్చి చేరాయి. జూన్ 26తో ముగిసిన 15 రోజులకు సంబంధించిన గణాంకాలను తాజాగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసింది. గత 29 సంవత్సరాల బ్యాంకింగ్ చరిత్రలో కేవలం 15 రోజుల్లో ఈ స్థాయిలో భారీగా డిపాజిట్లు రావడం ఇది మూడో అత్యధిక రికార్డు కావడం విశేషమని అధకారులు వెల్డించారు.

ఆర్థిక నిపుణులు విస్మయం..

అయితే, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన తాజా డేటా ప్రకారం

# ఉగ్రవాదంపై ఉమ్మడి గర్జన




భారత్-న్యూజిలాండ్ భేటీ
సరిహద్దు ఉగ్రవాదంపై ఖండన
జాయింట్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు
ఉగ్ర నిధులపై ఉక్కుపాదం
ఐరాస వేదికపై కలిసి పోరు

# టీజీపీఎస్సీ మరో నోటిఫికేషన్

TELANGANA PUBLIC SERVICE COMMISSION
తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్
2 లో

మొత్తం 7 ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం
జూలై 10 నుంచి ఆగస్టు 17 వరకు దరఖాస్తులు
రూ.1.37 లక్షల వరకు వేతనం
18--44 ఏళ్ల అభ్యర్థులు అర్హులు
టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు

# ఉన్మాది రక్తచరిత్ర.. ఆరుగురి బలి




ఎఫ్ఐఆర్‌లో షాకింగ్ నిజాలు
రెండు గంటల్లో ఆరుగురి హత్య
భార్య, పిల్లలనూ వదల్లేదు
7 బృందాల గాలింపు
సీపీ తరుణ్ జోషి కీలక వ్యాఖ్యలు

**న్యూస్ డెస్క్, 11 జూలై (బిఎన్ఎస్):** రంగారెడ్డి జిల్లా షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దైవాలగూడలో ఆరుగురి దారుణ హత్య ఉదంతం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. నిందితుడు రాజ్‌కుమార్ పై గతంలోనే ఫిర్యాదు చేసినా పోలీసులు నిర్లక్ష్యం వహించారని, సరైన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ ఘోరం జరిగిందంటూ బాలిక తరపు మృతుల బంధువులు, గ్రామస్థులు షాబాద్ పీఎస్ ఎదుట షాబాద్-కంది రహదారిపై బైఠాయించి భారీ ఆందోళనకు దిగారు.

ఎఫ్ఐఆర్‌లో నిర్ఘాంతపోయే నిజాలు

అయితే, ప్రధాన నిందితుడైన రాజ్‌కుమార్‌పై నమోదైన పోక్సో ఎఫ్ఐఆర్ కాపీలోని వివరాలు ఇప్పుడు అందరినీ భయాందోళనలకు గురిచేస్తున్నాయి.

## ఆ ఆరు హత్యలకు బాధ్యుడు సీఎం రేవంతే
### -టీఆర్ఎస్ చీఫ్ కవిత



రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని దైవాలగూడలో జరిగిన ఆరు హత్యలు రాష్ట్రాన్ని షేక్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పడంపై విపక్షాలు, అధికార పక్షాల మధ్య విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు.

2 లో

# ఏపీపై రాజ్‌నాథ్ ప్రశంసలు

విశాఖలో ఐఎన్ఎస్ మహేంద్రగిరి కమిషనింగ్
కర్నూలు 'డ్రోన్ హబ్'గా అవతరిస్తుంది
రక్షణ రంగంలో ఏపీ కీలక పాత్ర
డ్రోన్ సిటీపై మంత్రి ఆశాభావం
ఏపీ ప్రభుత్వానికి ప్రత్యేక అభినందనలు




# 15 నుంచి హెల్త్ కార్డుల అమలు

ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త
క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ కార్డులు
943 ఆస్పత్రుల్లో నగదు రహిత చికిత్స
2,594 చికిత్సలు కవర్
త్వరలో సీఎం చేతుల మీదుగా పంపిణీ




**న్యూస్ డెస్క్, 11 జూలై (బిఎన్ఎస్):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్య సేవల కోసం ఎంప్లాయీస్ హెల్త్ స్కీం (ఈహెచ్ఎస్) కార్డులను ఈ నెల 15 నుంచి అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎస్ సంజయ్ జాజు అధ్యక్షతన ఉద్యోగ సంఘాలతో శుక్రవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఈ మేరకు డిసిషన్ తీసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా త్వరలోనే ఉద్యోగులకు హెల్త్ కార్డులను అధికారికంగా పంపిణీ చేయనున్నట్టు సమావేశంలో వెల్లడించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన, నగదు రహిత వైద్య సేవలు అందించేందుకు ఈ హెల్త్ కార్డు విధానం ఉపయోగపడుతుందని సీఎస్ అభిప్రాయపడ్డారు. అమలుకు సంబంధించిన ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# రేవంత్ రెడ్డికి శీల పరీక్ష చేయాలి

రేవంత్‌పై కేటీఆర్ ఫైర్
కాళేశ్వరంపై కాంగ్రెస్ టార్గెట్
కన్నెపల్లి నుంచే నీటి ఎత్తిపోతలు
హరీష్‌రావుకు కేటీఆర్ అండ
కాంగ్రెస్‌కు 7 సీట్లు కూడా రావన్న కేటీఆర్




**న్యూస్ డెస్క్, 11 జూలై (బిఎన్ఎస్):** కాళేశ్వరం ప్రాజెక్టు నీటి ఎత్తిపోతలు, రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి సంక్షోభంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయ కక్షతో రేవంత్ రెడ్డి తెలంగాణ రైతాంగాన్ని నిలువునా ముంచుతున్నారని మండిపడ్డారు. రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ఇచ్చిన నివేదికను చూసి అయినా సీఎం సోయి తెచ్చుకోవాలని డిమాండ్ చేశారు.

# పాక్ గ్యాంగ్‌స్టర్‌తో లింకులు

102 మందిపై ఏటీఎస్ నిఘా
పాక్ గ్యాంగ్‌స్టర్‌తో లింకులు
సోషల్ మీడియా ద్వారా వల
'స్లీపర్ సెల్స్' కుట్ర బట్టబయలు
యువతే ప్రధాన లక్ష్యం
తల్లిదండ్రులకు ఏటీఎస్ హెచ్చరిక
డ్రగ్స్, ఆయుధాల అక్రమ రవాణా
దేశ వ్యతిరేక కుట్రలపై దర్యాప్తు

2 లో

BNS BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్



# ఉన్మాది రక్తచరిత్ర.. ఆరుగురి బలి

మొదటి పేజీ తరువాయి



గత 6 నెలలుగా రాజ్‌కుమార్ సదరు మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. తనతో మాట్లాడాలని, కలవాలంటూ నిరంతరం బలవంతం చేసేవాడని తెలుస్తోంది. శంషాబాద్‌లో కాలేజీకి వెళ్లే సమయంలోనూ రాజ్‌కుమార్ వేధింపులు మితిమీరడంతో, అతడి భయానికి తాళలేక తల్లి ఆ బాలికను కాలేజీకి పంపడం మాన్పించేసింది. ఇటీవల పరీక్షలు ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో తల్లి దగ్గరుండి బాలికను పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లింది. అయితే, పరీక్ష ముగిసిన వెంటనే బాలికను అందరూ చూస్తుండగానే లాక్కెళ్లేందుకు రాజ్‌కుమార్ ప్రయత్నించాడు. 'గతంలో నీ తండ్రిని ఫుల్లుగా తాగించి హార్ట్ ఎటాక్ అని చెప్పి నమ్మించి చంపినట్లే, మిమ్మల్ని కూడా చంపేస్తా' అంటూ రాజ్‌కుమార్ బాలికను, ఆమె తల్లిని తీవ్రంగా హెచ్చరించాడు. దీంతో ప్రాణభయంతో తమను కాపాడాలంటూ బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఇది వరకే నిందితుడిపై కేసు నమోదు..

ఉన్మాది రాజ్‌కుమార్‌కు ఈ కేసే మొదటిది కాదని తెలుస్తోంది. గతంలోనూ ఓ భూతగాదా విషయంలో ఇద్దరు వ్యక్తులను తీవ్రంగా కొట్టి, చంపేస్తానని బెదిరించినట్లుగా అతడిపై ఆరోపణలు ఉన్నాయి. ఇంతటి నేర చరిత్ర ఉన్న వ్యక్తిపై, ఓ తల్లి తన కూతురి ప్రాణాలు కాపాడాలని మొరపెట్టుకున్నా పోలీసులు నామమాత్రంగా స్పందించడం వల్లే ఇవాళ ఆరుగురి ప్రాణాలు పోయాయంటూ మృతుల బంధువులు, గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ షాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించడంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది.

రాత్రి 11 గంటల నుంచి హత్యలు షురూ.. భార్య, పిల్లలను కూడా

ఉన్మాది రాజ్‌కుమార్ కేవలం రెండు గంటల వ్యవధిలో సాగించిన నరమేధం ఒళ్లు గగుర్పొడిచేలా చేసింది. రాత్రి 11 గంటల సమయంలో సదరు మైనర్ బాలిక ఇంటికి వెళ్లిన రాజ్‌కుమార్ ఆమె అమ్మతో పాటు నాయనమ్మ అతి దారుణంగా కత్తితో విచాక్షణారహితంగా దాడి చేసి చంపేశాడు. అనంతరం బాలికను బలవంతంగా కారులో 3 కిలో మీటర్ల దూరంలో ఉన్న దైవాలగూడ చెరువు కట్ట వద్దకు తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడి గొంతు కోసి హతమార్చాడు. అంతటితో ఆగకుండా అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో తన ఇంటికి బయలుదేరుతూనే.. దారిలో భార్యకు ఫోన్ చేసి ఒకే ఒక్కసారి పిల్లలను చూస్తానని చెప్పాడు. ఇంట్లోకి వెళ్లడమే ఆలస్యం భార్యపై కత్తితో దాడి చేయగా, ఆమె ప్రాణభయంతో బయటకు పరుగులు తీసినప్పటికీ వదలకుండా ఈడ్చుకుంటూ లోపలికి లాకెళ్లి గొంతు కోసి చంపేశాడు. ఆ తర్వాత నిద్రిస్తున్న తన ఇద్దరు కన్న పిల్లలను సైతం ఏమాత్రం జాలి లేకుండా గొంతు కోసి మట్టుబెట్టాడు. ఇలా కేవలం రెండు గంటల్లో ఆరుగురిని పొట్టనబెట్టుకున్న రాజ్‌కుమార్, వారికి రక్తం ఒడుతున్న కారులోనే అక్కడి నుంచి పరారవుతూ తన తండ్రికి ఫోన్ చేసి 'నేను ఆరుగురిని చంపేశాను' అని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు.

స్పందించిన సీపీ తరుణ్ జోషి..

దైవాలగూడలో ఆరుగురి హత్యలపై తాజాగా సీపీ తరుణ్ జోషి స్పందించారు. నిందితుడు రాజ్‌కుమార్‌పై మే 16 కేసు నమోదైందని తెలిపారు. అనంతరం అతడు పరారయ్యాడని, అప్పటి నంచి అతడి కోసం గాలించామని అన్నారు. తర్వాత రాజ్‌కుమార్ బెయిల్ వచ్చి బయటకు వచ్చాడని.. అతడికి రెండు, మూడుసార్లు కౌన్సిలింగ్ కూడా ఇచ్చామని, రాజ్‌కుమార్ మానసిక పరిస్థితి సరిగా లేదన్నారు. అతడికి బెట్టింగ్, గ్యాంబ్లింగ్ అలవాటు కూడా ఉందని తెలిపారు. మరోవైపు భార్య, పిల్లల హత్యపై కూడా దర్యాప్తు కొనసాగుతోందని అన్నారు. ప్రస్తుతం పరారీలో ఉన్న రాజ్‌కుమార్ కోసం 7 టీమ్స్ ముమ్మరంగా గాలిస్తున్నాయని సీపీ తరుణ్ జోషి వెల్లడించారు.

# ఆ ఆరు హత్యలకు బాధ్యుడు సీఎం రేవంతే

## -టీఆర్ఎస్ చీఫ్ కవిత డిమాండ్

మొదటి పేజీ తరువాయి

తాజాగా మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఈ ఆరు హత్యలపై ట్విట్టర్ వేదికగా రియాక్ట్ అయ్యారు. హైదరాబాద్ నగర శివార్లలో ఒకేరోజు ఆరు హత్యలు జరిగాయంటూ రాష్ట్రంలో ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ ఉన్నాయా అనే అనుమానం కలుగుతోందని అన్నారు.

పోక్సో కేసులో అరెస్ట్ అయి బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితుడు 17 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసి ఆమెను, తల్లిని, నాయనమ్మను అతి కిరాతకంగా హత్య చేశాడని కవిత పేర్కొన్నారు. చివరికి కనికరం కూడా లేకుండా భార్య, పిల్లలను చంపేయడం దారుణమని అన్నారు. ఇన్ని హత్యలు చేస్తున్నా నిఘా వ్యవస్థ, పోలీసులు నిందితుడిని ఆపలేకపోవడం సిగ్గుచేటని కామెంట్ చేశారు. ఇంతటి క్రూర నేర ప్రవృత్తి ఉండి పరారీలో ఉన్న నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని.. కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక రాష్ట్రంలో ఆరుగురి హత్యలకు కారణమైన, సీఎం మరియు హోంమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రేవంత్ రెడ్డి తన పదవులకు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# 1000 క్షిపణులు సిద్ధం.. ఇరాన్‌కి ట్రంప్ సంచలన హెచ్చరిక

**న్యూస్ డెస్క్, 11 జూలై (బిఎన్ఎస్):** ఓ వైపు శాంతి చర్చలు అంటూనే మరోవైపు ఇరాన్ పై అమెరికా భారీ దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ 'ట్రూత్ సోషల్' లో ఇరాన్‌ను ఉద్దేశించి చేసిన ఒక పోస్ట్ ప్రస్తుతం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది. అమెరికా అధ్యక్షుడైన తనను (ట్రంప్‌ను) హతమార్చేందుకు ఇరాన్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందనే వార్తల నేపథ్యంలో ఆయన ఇరాన్‌కు మునుపెన్నడూ లేని విధంగా అత్యంత కఠినమైన హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ గనుక అలాంటి సాహసానికి ఒడిగడితే ఆ దేశం సర్వనాశనం అవ్వడం ఖాయమని హెచ్చరించారు.

సైన్యానికి ఆదేశాలు జారీ

అమెరికా అధ్యక్షుడిని – అంటే నన్ను హతమార్చడానికి, ఆ ప్రయత్నం చేయడానికి ఇరాన్ ప్రభుత్వం ప్రపంచవ్యాప్తంగా వివిధ వేదికల నుంచి హెచ్చరికలు జారీ చేస్తోంది. ఒకవేళ ఇరాన్ గనుక ఆ చర్యకు పూనుకుంటే.. ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ లక్ష్యంగా 1000 క్షిపణులు సిద్ధంగా ఉంచబడ్డాయి. వాటి వెనుకే మరో వేలాది క్షిపణులు దూసుకు రావడానికి సిద్ధంగా ఉన్నాయి. దీనికి సంబంధించిన సైనిక ఉత్తర్వులు ఇప్పటికే జారీ అయ్యాయి. ఒక సంవత్సరం కాల పరిమితితో ఇరాన్ లోని అన్ని ప్రాంతాలను పూర్తిగా నాశనం చేయడానికి, తుడిచి పెట్టడానికి అమెరికా సైన్యం సిద్ధంగా, సన్నద్ధంగా ఉందని ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్" అని ఆయన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ ప్రకటనతో ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం మరింత ముదిరింది.

# టీజీపీఎస్సీ మరో నోటిఫికేషన్

**న్యూస్ డెస్క్, 11 జూలై (బిఎన్ఎస్):** టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ పోస్టుల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ ప్రకారం మొత్తం 7 ఖాళీలు ఉన్నాయి. ఇవి మల్టీ జోనల్ క్యాడర్‌లో ఉన్నాయి. స్టేట్ లెవెల్ క్యాడర్‌లో 2, మల్టీ జోనల్‌లో 5 ఖాళీలు ఉన్నాయి. ఆన్‌లైన్ దరఖాస్తులు జూలై 10 నుంచి మొదలు కాగా.. ఆగస్టు 17 వరకు చివరి తేదీ అని అధికారులు వెల్లడించారు. జీతం స్కేల్ రూ. 58,850 నుంచి రూ.1,37,050 వరకు ఉంటుంది. విద్యార్హతలు బీ.ప్లానింగ్ లేదా బీటెక్ ప్లానింగ్ లో డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 44 లోపు వారు అప్లై చేసుకోవచ్చు. అర్హులైన అభ్యర్థులు టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ https://www.tgpsc.gov.in/ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

# హరీశ్ రావుపై పోటీ చేస్తా

మొదటి పేజీ తరువాయి

సంగారెడ్డిలో నిర్మలనే అభ్యర్థి:

వచ్చే ఎన్నికల్లో సంగారెడ్డి నియోజకవర్గం రిజర్వేషన్ మహిళా, జనరల్ ఏది ఉన్నా కాంగ్రెస్ అభ్యర్థి తన సతీమణి నిర్మలా జగ్గారెడ్డినే అని స్పష్టం చేశారు. యాక్టివ్ లేని వాళ్ళని సీఎం రేవంత్ రెడ్డి అలెర్ట్ చేస్తున్నారని సీఎం సూచనలతో ఎమ్మెల్యేలు అలెర్ట్ అవుతున్నారని చెప్పారు. సీఎం చెప్పిన తర్వాత కూడా తీరు మారకపోతే వేటు తప్పదని అలాంటి వారికి సీటు ఇవ్వాలో లేదో సీఎం, పీసీసీ చీఫ్, ఇంచార్జీ నిర్ణయం తీసుకుంటారన్నారు. అపోజిషన్ ఎప్పుడూ రూలింగ్ పార్టీని ఎటాక్ చేయడం అది రాజకీయ నీతిలో భాగం అన్నారు. కేసీఆర్ మొదటిసారి సీఎం అయినప్పుడు కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పనితీరు బాగాలేదని సర్వేలు చెప్పాయన్నారు. రాజకీయాల్లో మేమే తోపులు అంటే నడవదని జగ్గారెడ్డి అన్నారు. పెద్ద పెద్ద తోపులను కూడా ప్రజలు పక్కన పెట్టిన సందర్భాలు ఉన్నాయని అందువల్ల సిట్టింగ్ ఎమ్మెల్యే తోపు కాదు సీఎం, పీసీసీ చీఫ్, ఇంచార్జీ మాత్రమే తోపులన్నారు. రాజకీయాల్లో పర్మినెంట్‌గా ఎవరూ తోపులు ఉండరన్నారు.

# ఏపీపై రాజ్‌నాథ్ ప్రశంసలు



న్యూస్ డెస్క్, 11 జూలై (బిఎన్ఎస్): భారత రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఆంధ్రప్రదేశ్ పై ప్రశంసలు కురిపించారు. భారత రక్షణ రంగ బలోపేతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పోషిస్తున్న పాత్రను ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డ్‌లో అత్యాధునిక యుద్ధనౌక 'ఐఎన్ఎస్ మహేంద్రగిరి' కమిషనింగ్ (నావికాదళంలో చేరిక) వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. ఏపీ రక్షణ రంగ ప్రగతిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎనిమిది డ్రోన్ కంపెనీల కన్సార్టియంతో కర్నూలులో ఏర్పాటు కాబోతున్న 'డ్రోన్ సిటీ' గురించి ఆయన ఈ వేదికపై ప్రత్యేకంగా ప్రస్తావించారు.

సూరత్, బెంగళూరు తరహాలోనే కర్నూలు డ్రోన్ హబ్

"ప్రపంచవ్యాప్తంగా సూరత్ నగరం 'డైమండ్ సిటీ'గా, బెంగళూరు దేశానికి 'సిలికాన్ వ్యాలీ'గా ఎలా గుర్తింపు పొందాయో.. అదే తరహాలో భవిష్యత్తులో కర్నూలు ప్రాంతం భారతదేశానికే తిరుగులేని 'డ్రోన్ హబ్' గా గుర్తింపు పొందుతుందని నేను బలంగా నమ్ముతున్నాను" అని రక్షణ మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఆకాశంలో ప్రయాణించే దేశీయ యుద్ధ విమానం 'ఏఎంసీఏ', సముద్ర గర్భంలో పనిచేసే బీడీఎల్ నావికాదళ వ్యవస్థలు, డ్రోన్ రంగంలో కర్నూలు దూకుడు, సముద్ర ఉపరితలంపై నేడు చేరిన ఐఎన్ఎస్ మహేంద్రగిరి.. ఇవన్నీ చూస్తుంటే అన్‌మ్యాన్డ్ (డ్రోన్) రంగం ఇలా ప్రతి విభాగంలోనూ భారతదేశ రక్షణ సామర్థ్యాలకు ఆంధ్రప్రదేశ్ అద్భుతమైన సహకారాన్ని అందిస్తోందని కొనియాడారు. ఈ గొప్ప విజయానికి గాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, ఆ ప్రాంత ప్రజలకు రక్షణ మంత్రి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# బ్యాంకుల్లో డిపాజిట్ల వెల్లువ

మొదటి పేజీ తరువాయి

దేశంలోని షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల మొత్తం డిపాజిట్ల విలువ రికార్డు స్థాయిలో రూ.219.78 లక్షల కోట్లకు చేరుకుంది. అంతకుముందు 15 రోజులతో పోలిస్తే ఏకంగా 3.3 శాతం వృద్ధిని నమోదు చేసింది. సాధారణంగా ఆర్థిక సంవత్సరం ముగిసే మార్చి నెల చివరి వారాల్లో, బ్యాంకుల విలీనం జరిగినప్పుడు మాత్రమే ఇలాంటి భారీ మార్పులు కనిపిస్తాయి. కానీ ఏప్రిల్–జూన్ త్రైమాసికం చివర్లో డిపాజిట్లలో ఈ స్థాయి వృద్ధి నమోదు కావడం ఆర్థిక నిపుణులను సైతం విస్మయానికి గురిచేస్తోంది.

డిపాజిట్లకు తోడుగా పెరిగిన రుణాలు

ఇక కేవలం డిపాజిట్లే కాకుండా, ఇదే 15 రోజుల వ్యవధిలో బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల పరిమాణం కూడా భారీగా పెరిగింది. బ్యాంక్ క్రెడిట్ ఏకంగా రూ.3.25 లక్షల కోట్లు మేర పెరిగి మొత్తం రూ.171.43 లక్షల కోట్లకు చేరింది. అయితే డిపాజిట్ల వృద్ధి రేటు 3.3 శాతంతో పోలిస్తే రుణాల వృద్ధి రేటు 1.9శాతం కంటే తక్కువనే ఉంది. గత కొంతకాలంగా బ్యాంకింగ్ రంగంలో డిపాజిట్లు తగ్గి, రుణాలు పెరుగుతున్నాయంటూ ఆందోళన వ్యక్తమవుతున్న తరుణంలో ఈ సరికొత్త రికార్డు బ్యాంకులకు మంచి ఊపునిస్తోంది.

రికార్డు వెనుక అసలు కారణాలు..

డిపాజిట్లు రికార్డు స్థాయిలో పెరగడానికి గల కారణాలను బ్యాంకింగ్ రంగ నిపుణుల విశ్లేషణ ఆసక్తికరంగా ఉంది. జూన్ త్రైమాసికం ముగింపు కావడంతో కార్పొరేట్ కంపెనీలు, ప్రభుత్వ సంస్థలు తమ అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లింపులు, క్వార్టర్–ఎండ్ విండో డ్రెస్సింగ్ కోసం పెద్ద ఎత్తున నిధులను బ్యాంకుల్లో డిపాజిట్ చేశాయి. అందువల్లే కేవలం 15 రోజుల్లోనే రూ.7 లక్షల కోట్ల మేర భారీ డిపాజిట్లు నమోదయ్యాయని చెబుతున్నారు. ఈ చారిత్రాత్మక వృద్ధితో దేశీయ మార్కెట్లలో నగదు లభ్యత సమస్యలు పూర్తిగా తొలిగిపోతాయని ఆర్థిక రంగానికి చెందిన నిపుణులు అంచనా వేస్తున్నారు.

# 15 నుంచి హెల్త్ కార్డుల అమలు



**న్యూస్ డెస్క్, 11 జూలై (బిఎన్ఎస్):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్య సేవల కోసం ఎంప్లాయీస్ హెల్త్ స్కీం (ఈహెచ్ఎస్) కార్డులను ఈ నెల 15 నుంచి అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎస్ సంజయ్ జాజు అధ్యక్షతన ఉద్యోగ సంఘాలతో శుక్రవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఈ మేరకు డిసిషన్ తీసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా త్వరలోనే ఉద్యోగులకు హెల్త్ కార్డులను అధికారికంగా పంపిణీ చేయనున్నట్టు సమావేశంలో వెల్లడించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన, నగదు రహిత వైద్య సేవలు అందించేందుకు ఈ హెల్త్ కార్డు విధానం ఉపయోగపడుతుందని సీఎస్ అభిప్రాయపడ్డారు. అమలుకు సంబంధించిన ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

క్యూఆర్ కోడ్‌తో..

క్యూఆర్ కోడ్‌తో నూతన హెల్త్ కార్డులు మొబైల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అన్ని వివరాలతో 'ఈహెచ్ సీటీ' యాప్‌ను రూపొందించనున్నారు. చికిత్సలకు సీజీహెచ్ఎస్ రేట్లు వర్తింపజేయాలని నిర్ణయించారు. నాలుగు రోజుల్లో నూతన ఈ హెచ్ ఎస్ మార్గదర్శకాలకు సంబంధించిన ఉత్తర్వులను విడుదల చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 943 హాస్పిటల్స్‌లో హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందులో 2,594 ప్రొసీజర్స్ కవర్ కానున్నాయి.

మార్గదర్శకాల కోసం మీటింగ్..

నూతన 'ఈహెచ్ఎస్' మార్గదర్శకాలపై చర్చించేందుకు ఈ నెల 13న 'ఆరోగ్యశ్రీ' సీఈఓతో సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ ఖర్చుతో అన్ని జిల్లా కేంద్రాల్లో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీఎండీ.ఎక్కా, ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూ, ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, డీజీ శిఖా గోయల్, కార్యదర్శులు హనుమంత్ కొండిబా, పాపిరెడ్డి, వాణి పాల్గొన్నారు. టీఎన్‌జీవో అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీజీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏలూరి శ్రీనివాసరావు, బి. శ్యామ్, దామోదర్ రెడ్డి (పీఆర్‌టీయూ), చావా రవి (యూటీఎఫ్), శ్రీనివాసరెడ్డి (సెక్రటేరియట్ అసోసియేషన్), వంగా రవీందర్ రెడ్డి (ట్రెసా), సదానంద గౌడ్ (ఎస్‌టీయూ), సైదులు (ఎస్‌టీఎఫ్), దాస్య నాయక్ (క్లాస్–4 ఉద్యోగుల సంఘం), పెన్షనర్ల సంఘం ప్రతినిధులు వెంకటరెడ్డి, కృష్ణమూర్తి, ఉమాదేవి తదితరులు హాజరయ్యారు.

# ఉగ్రవాదంపై ఉమ్మడి గర్జన

**న్యూస్ డెస్క్, 11 జూలై (బిఎన్ఎస్):** అంతర్జాతీయంగా ఉగ్రవాద నిర్మూలనే లక్ష్యంగా భారత్, న్యూజిలాండ్ దేశాలు చేతులు కలిపాయి. ఇరు దేశాల ప్రధాన మంత్రుల ద్వైపాక్షిక భేటీ అనంతరం విడుదల చేసిన ఉమ్మడి ప్రకటనలో సరిహద్దు ఉగ్రవాదం తో పాటు అన్ని రకాల ఉగ్రవాద రూపాలను ముక్తకంఠంతో తీవ్రంగా ఖండించారు. ముఖ్యంగా జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడితో పాటు, ఢిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన ఉగ్రఘటనలను ఇరు నేతలు ప్రస్తావిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్రవాదం పట్ల ఏమాత్రం సహనం వహించని స్థిరమైన విధానాన్ని ప్రపంచ దేశాలు అవలంబించాలని, ఉగ్రవాదులకు అందుతున్న ఆర్థిక వనరుల నెట్‌వర్క్‌లను మరియు వారి సురక్షిత స్థావరాలను పూర్తిగా అణచివేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చాయి.

ఉగ్రవాదం, హింసాత్మక తీవ్రవాదాన్ని తిప్పికొట్టేందుకు ఇరు దేశాల మధ్య సమాచారం, విజ్ఞానాన్ని పంచుకునేలా 'కౌంటర్–టెర్రరిజం జాయింట్ వర్కింగ్ గ్రూప్' ఏర్పాటుకు సంబంధించిన అవగాహన ఒప్పందం పై ఇరు దేశాలు సంతకాలు చేశాయి. ఐక్యరాజ్యసమితి , ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ వంటి అంతర్జాతీయ వేదికలపై కలిసి పనిచేసేందుకు ఇరు నేతలు తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఐరాస భద్రతా మండలి 1267 ఆంక్షల కమిటీ నిషేధించిన ఉగ్రవాద సంస్థలు, వ్యక్తులు మరియు వారి వెనక ఉండి నిధులు సమకూర్చే స్పానర్లపై తక్షణమే, కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రపంచ దేశాలను డిమాండ్ చేశారు.

# అన్నదాతకు షాక్.. రైతు బీమాపై సందిగ్ధం

మొదటి పేజీ తరువాయి

ఇందిరమ్మ బీమా పథకం మాత్రం కుటుంబంలో ఒక్కరికే వర్తించనుంది. ఇందిరమ్మ బీమా అమలు చేస్తే ఎంతమందికి పరిహారం అందుతుందనేది మాత్రం ఇప్పటికీ ప్రశ్నార్థకంగానే మారింది.

ఆగస్టు 14తో లాస్ట్..

ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రారంభించే ఇందిరమ్మ బీమా నవంబర్?19 ప్రారంభిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేశారు. రైతు బీమా గడువు ఆగస్టు 14తో ముగియనుంది. ఈరెండు పథకాల మధ్య నాలుగు నెలల వ్యవధి ఉంటుంది. ఈమధ్య కాలంలో మరణించిన రైతులకు పరిహారం పరిస్థితి ఏమిటనే విషయం ఆందోళన కలిగిస్తోంది. అప్పటివరకు ప్రభుత్వం రైతు బీమా పథకం ప్రీమియం చెల్లిస్తుందా? పథకం పక్కకు పెడుతుందా? అనే అంశంపై ప్రభుత్వ వర్గాల్లో క్లారిటీ లేదు. ఇప్పటివరకు ఏటా సుమారు 18 వేల నుంచి 25 వేల మంది రైతు కుటుంబాలకు బీమా పరిహారం అందేది. ఈ నాలుగు నెలల పాటు బీమా పథకం అందకుంటే ఎన్నో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటాయి. రేవంత్ ప్రభుత్వం నాలుగు నెలలకు సంబంధించిన ప్రీమియం చెల్లించాలని రైతులు సంఘాలు సూచనలు చేస్తున్నాయి. అన్నదాతకు ఎంతో ఆసరాగా నిలిచే పథకం రద్దుపై పాలకులు ఆలోచించాలని రైతులు కోరుతున్నారు.

# రేవంత్ రెడ్డికి శీల పరీక్ష చేయాలి

**న్యూస్ డెస్క్, 11 జూలై (బిఎన్ఎస్):** కాళేశ్వరం ప్రాజెక్టు నీటి ఎత్తిపోతలు, రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి సంక్షోభంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయ కక్షతో రేవంత్ రెడ్డి తెలంగాణ రైతాంగాన్ని నిలువునా ముంచుతున్నారని మండిపడ్డారు. రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ఇచ్చిన నివేదికను చూసి అయినా సీఎం సోయి తెచ్చుకోవాలని డిమాండ్ చేశారు.

మేడిగడ్డతో పని లేకుండానే నీళ్లు లిఫ్ట్ చేయవచ్చు..

మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూసివేయకుండానే కేవలం కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయవచ్చని రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసిన విషయాన్ని కేటీఆర్ బహిర్గతం చేశారు. ప్రస్తుతం కన్నెపల్లి వద్ద 96.79 మీటర్ల మేర నీటి ప్రవాహం ఉందన్నారు. కానీ కేవలం 94 మీటర్ల లభ్యత ఉంటేనే పంపులను ఆన్ చేసి నీటిని లిఫ్ట్ చేయవచ్చని నిపుణులు స్పష్టం చేశారు. ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ ప్రకృతి ప్రసాదించిన ఈ ప్రవాహం మరో 100 రోజులు ఇలాగే ఉంటుందని తెలిపారు. రోజుకు 2 టీఎంసీల చొప్పున మొత్తం 200 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే.. గోదావరి బేసిన్‌లోని అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి, మిడ్ మానేరు వంటి అన్ని జలాశయాలను నింపి తెలంగాణను సస్యశ్యామలం చేయవచ్చని కేటీఆర్ వివరించారు.

ఇది కాలం తెచ్చిన కరువు కాదు..

రాష్ట్రంలో నీళ్లు లేక రైతులు ఏడుస్తుంటే, కాళేశ్వరం ప్రాజెక్టు ను బద్నాం చేయాలనే కుట్రతోనే సీఎం రేవంత్ రెడ్డి నీళ్లివ్వడం లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని ఎద్దేవా చేశారు. 2022 వరదల ఫోటోలు చూపించి కన్నెపల్లి మునిగిపోయిందంటూ అడ్డమైన మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. పోలవరం ప్రాజెక్టు వల్ల మునిగే భద్రాచలాన్ని పట్టుకుని.. మేడిగడ్డ వల్లే మునుగుతోందని బుర్రలేని మాటలు రేవంత్ మాట్లాడుతుందని కేటీఆర్ ఫైర్ అయ్యారు గోదావరిలో లక్షల క్యూసెక్కుల వరద నీరు కళ్లముందు కిందకు పోతుంటే.. ఎత్తిపోయదానికి నీళ్లు లేవనేవాడు బుర్రతక్కువ వాడా? లేక రైతుల కోసం నీళ్లివ్వమనేవాడు బుర్రతక్కువ వాడా? అని కేటీఆర్

హరీష్‌రావు కేసీఆర్ తయారు చేసిన సైనికుడు

ఇక మాజీ మంత్రి హరీష్ రావు పై వస్తున్న పుకార్లను కేటీఆర్ గట్టిగా తిప్పికొట్టారు. హరీష్ రావు పార్టీ ఆవిర్భావం కంటే ముందు నుంచే కేసీఆర్‌కు రక్షణ కవచంగా నిలిచిన సైనికుడని కేటీఆర్ కొనియాడారు. తనపై వచ్చిన పుకార్లను ఆయన వందల సార్లు తిప్పికొట్టారని అన్నారని.. తమకు క్యారెక్టర్ చాలా ముఖ్యమని అన్నారు. నాలుగు పార్టీలు మారిన రేవంత్ రెడ్డి.. హరీష్ రావు శీల పరీక్ష గురించి మాట్లాడటం హాస్యాస్పదమని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ఢిల్లీకి పోతే పొద్దున కాంగ్రెస్‌తో, రాత్రికి బీజేపీ వాళ్లతో ఉంటారని.. శీల పరీక్ష చేయాల్సింది రేవంత్ రెడ్డికేనని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి పాలన ఇలాగే ఉంటే రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు 117 అసెంబ్లీ స్థానాలు కాదు కదా.. కనీసం 7 సీట్లు కూడా రావని కేటీఆర్ కామెంట్ చేశారు.

# పాక్ గ్యాంగ్‌స్టర్‌తో లింకులు

**న్యూస్ డెస్క్, 11 జూలై (బిఎన్ఎస్):** పాకిస్థానీ గ్యాంగ్‌స్టర్ షాజాద్ భట్టితో సంబంధాలున్నాయనే అనుమానంతో మహారాష్ట్ర ఉగ్రవాద నిరోధక దళం (ఏటీఎస్) 102 మందిపై నిఘా పెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 14 ఏటీఎస్ యూనిట్లకు చెందిన 58 బృందాలు ఈ భారీ ఆపరేషన్‌లో పాల్గొంటున్నాయి. భారతీయ యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షించేందుకు షాజాద్ ముఠా పన్నుతున్న కుట్రలను భగ్నం చేసే దిశగా అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

యువతకు వల వేస్తున్నదిలా: భారత్‌లో ఉగ్ర నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు షాజాద్ భట్టితో పాటు అతని అనుచరులైన అబిద్ జాట్, అజ్మల్ గుజ్జర్, హమ్మద్ మెమన్, రాణా హస్నైన్ తదితరులు సోషల్ మీడియాను ప్రధాన ఆయుధంగా వాడుకుంటున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. వీరు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, టెలిగ్రామ్ ద్వారా యువతతో పరిచయాలు పెంచుకుంటున్నారు. ముఖ్యంగా నిరుద్యోగ, పేద యువతను లక్ష్యంగా చేసుకుని.. చిన్న పనులకే సులభంగా డబ్బు సంపాదించవచ్చని ఆశచూపుతూ ఉగ్ర కార్యకలాపాల వైపు లాగుతున్నట్లు సమాచారం.

'స్లీపర్ సెల్స్'గా మార్చడమే టార్గెట్!: ఆకర్షితులైన యువతను 'స్లీపర్ సెల్స్'గా మార్చి, వారి ద్వారా ఆర్మీకి చెందిన సున్నితమైన సమాచారాన్ని సేకరించడం, డ్రగ్స్ రవాణా, అక్రమ ఆయుధాల తరలింపు వంటి దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఏటీఎస్ అధికారులు గుర్తించారు.

తల్లిదండ్రులకు ఏటీఎస్ సూచనలు..: పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలు, వారి ప్రవర్తనలో వచ్చే ఆకస్మిక మార్పులపై తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంచాలని ఏటీఎస్ సూచించింది. పిల్లలు ఆన్‌లైన్‌లో అనుమానాస్పద వ్యక్తులతో సంభాషిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరింది. సామాజిక సామరస్యాన్ని, జాతీయ సమగ్రతను దెబ్బతీసే ఎలాంటి పోస్టులను పౌరులు షేర్ చేయవద్దని పోలీసులు సూచించారు. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు తేలితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని మహారాష్ట్ర ఏటీఎస్ అధికారులు తీవ్రంగా హెచ్చరించారు.

### రాష్ట్రంలో 11 వేల కోట్ల వరకు

# ఉచిత బస్ ప్రయాణాలు

### హుజూర్ నగర్ లో బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన ..



నల్లగొండ (బిఎన్ఎస్):. తెలంగాణ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల వ్యవధిలోనే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించామని రాష్ట్ర రోడ్డు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సూర్యాపేట జిల్లా హుజుర్నగర్ లో 3.52 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మిస్తున్న బస్సు స్టేషన్ నిర్మాణానికి రాష్ట్ర ఆహార పౌరసరఫరాలు మరియు నీటి పారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి మంత్రి పొన్నం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా 10,173 ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రజలను గమ్యస్థానాలకు చేర్చడం జరుగుతుందని, 35 లక్షల మహిళలు మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం చేస్తున్నారని తద్వారా , మహిళలకు 11,400 కోట్ల రూపాయల మేర ప్రయోజనం చేకూరిందని అన్నారు. మహిళా సంఘాలకు 600 బస్సులను అందించి ఆర్టీసీని బలోపేతం చేస్తున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతుందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.. ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి పేదవాడి కడుపు నింపేందుకు సన్న బియ్యంతో పాటు, మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు.

హుజూర్‌నగర్ లో బస్టాండ్ నిర్మాణంతో ప్రయాణాలు మరింత సులభతరం అవుతాయని అన్నారు.

# ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డేకు ఘన వీడ్కోలు..!!



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 11: కడపజిల్లా రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే పదోన్నతి పొందారు. అయనను ప్రభుత్వం అమరావతి లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీగా నియమించింది. ఈ సందర్భంగా ఏఎస్పీ మనోజ్ రామ్నాథ్ హెగ్డే కు ఓఎస్డీ అధికారులు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. రాజంపేట సబ్ డివిజన్ లోని పోలీసు అధికారులు ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు పోలీసు అధికారులు ఏఎస్పి మనోజ్ రామనాథ్ హెగ్డేని శాలువాతో సత్కరించి, జ్ఞాపికలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వక్తలు మాట్లాడుతూ.. రాజంపేటలో శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్, నేరాల నియంత్రణలో ఆయన విశేష సేవలు అందించారని కొనియాడారు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ సమర్థవంతమైన పరిపాలన అందించిన అధికారిగా మంచి గుర్తింపు పొందారని పేర్కొన్నారు. మనోజ్ రామనాథ్ హెగ్డే మాట్లాడుతూ రాజంపేట ప్రజలు, సహచర పోలీసు అధికారులు, సిబ్బంది అందించిన సహకారాన్ని ఎప్పటికీ మరువలేనని అన్నారు. తన పదవీకాలంలో అందరి సహకారంతోనే సమర్థవంతంగా విధులు నిర్వర్తించగలిగానని తెలిపారు. అమరావతిలో కొత్త బాధ్యతలను కూడా అదే నిబద్ధతతో నిర్వహిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి ధవళేశ్వరం పర్యటనకు రైతులంతా పెద్ద ఎత్తున తరలిరావాలి



అనపర్తి(బిఎన్ఎస్)జూలై 11 : ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ కి నూతనంగా నిర్మించిన గేట్లను ప్రారంభించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రానున్న నేపథ్యంలో అనపర్తి నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున రైతులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు... నాలుగు మండలాల తెలుగుదేశం నాయకులతో సమావేశమై వారికి దిశానిర్దేశం చేసిన యువ నేత నల్లమిల్లి మనోజ్ రెడ్డి.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గడచిన అసెంబ్లీ సమావేశాలలో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేసిన విజ్ఞప్తికి అనుగుణంగా ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ కి ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేసి పాడైపోయిన గేట్ల స్థానంలో కొత్త గేట్లను ఏర్పాటు చేయడం జరిగింది. వాటిని ప్రారంభించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం వస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికి నియోజకవర్గ రైతులు అందరూ కృతజ్ఞతా భావంతో స్వాగతం పలకాల్సిన అవసరం ఉంది. కావున నాయకులందరూ రైతులందరికీ ఈ విషయం తెలియజేసి సోమవారం నాడు ఉదయం 7 గంటలకే అనపర్తి నుండి బయలుదేరి ధవళేశ్వరం చేరుకునే ఏర్పాటును చేయవలసిందిగా కోరుచున్నాను అని మనోజ్ రెడ్డి నాయకులను ఆదేశించడం జరిగింది.

# వియత్నాం బోటు ప్రమాద ఘటనపై సీఎం తీవ్ర విచారం

**● ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు చనిపోవడంపై ఆవేదన వ్యక్తం చేసిన సిఎం ●బాధితులకు అవసరమైన పూర్తి సహాయం అందించాలని అధికారులకు ఆదేశం**

అమరావతి,బిఎన్ఎస్ జూలై 11: వియత్నాంలో పర్యాటక బోటు ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంపై సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి మొత్తం 33 మంది వియత్నాం పర్యటనకు వెళ్లారు. వీరిలో 19 మంది ప్రమాదం జరిగిన బోటులో ఉన్నారు. ఈ ఘటనలో ఇద్దరు చనిపోగా, మిగిలిన వారిని రక్షించారు. ఒకరు తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్నారు. విహార యాత్రకు వెళ్లి ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన వారు అంతా సురక్షితంగా ఉన్నారు. ప్రమాద ఘటన, బాధితులకు అందుతున్న సాయం, పర్యాటకుల ప్రస్తుత పరిస్థితిపై సిఎం అధికారులతో మాట్లాడారు. ప్రమాదంలో చిక్కుకుని ప్రాణాలతో బయటపడిన వారిని రాష్ట్రానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాణాలు కోల్పోయిన ఇద్దరు రాష్ట్ర వాసుల కుటుంబ సభ్యులతో మాట్లాడి అవసరమైన సహాయం చేయాలని సిఎం అధికారులను అదేశించారు. ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులు... వియత్నాం అధికారులతో, అక్కడ భారత ఎంబసీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

# నల్గొండలో “నాలెడ్జ్ ఆన్ వీల్స్” కార్యక్రమం



నల్లగొండ (బిఎన్ఎస్): రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగానే “Knowledge on Wheels” వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందని నల్లగొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి అక్బర్ అలీ అన్నారు.. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (SATG) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న “Knowledge on Wheels” కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన సీనియర్ కోచ్‌లు, ఫిజియోథెరపిస్ట్‌ల బృందం నల్గొండ జిల్లాలో పర్యటించింది.. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు క్రీడాకారుల్లో క్రీడా సంస్కృతి పెంపొందించడం, క్రీడల్లో జరిగే గాయాల నివారణ, గాయాల అనంతర చికిత్స, శాస్త్రీయ శిక్షణ, ఫిట్‌నెస్, పోషకాహారం వంటి అంశాలపై నిపుణులు సవివరంగా అవగాహన కల్పించారు. క్రీడాకారులు అనుసరించాల్సిన జాగ్రత్తలు, గాయాలను నివారించే పద్ధతులను వివరించారు... ఇలాంటి కార్యక్రమాల ద్వారా క్రీడాకారుల్లో శాస్త్రీయ అవగాహన పెరిగి, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు మరింత మెరుగుపడతాయనీ అన్నారు..

# శేరిలింగంపల్లి నియోజకవర్గంలో SIR-2026 గణన పురోగతి ఆకస్మిక తనిఖీ



శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో జరుగుతున్న SIR-2026 గణన ప్రక్రియ పురోగతిని నోడల్ అధికారులు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు మరియు బూత్ లెవెల్ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించటం జరిగింది.

ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు ఇవ్వడం జరిగింది:

- ఊపు కొనసాగించాలి: ప్రస్తుతం ఉన్న వేగాన్ని తగ్గించకుండా ముందుకు సాగాలి
- క్షేత్రస్థాయి సమన్వయం బలోపేతం: నోడల్ అధికారులు, సూపర్‌వైజర్లు మరియు దీూాల మధ్య సమన్వయాన్ని మరింత మెరుగుపరచాలి
- సకాలంలో, ఖచ్చితంగా, సమగ్రంగా పూర్తి: గణన ప్రక్రియను నిర్ణీత గడువులోపు ఎలాంటి లోపాలు లేకుండా 100% పూర్తి చేయాలి

ప్రతి ఇంటిని సందర్శించి, అర్హులైన ప్రతి ఓటరు వివరాలను సరిగ్గా నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వవద్దని నారాయణ్ అమిత్ ఐఏఎస్ అధికారులను ఆదేశించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జేపీ నగర్, దీప్తిశ్రీ నగర్ అలగే మాదాపూర్ ఏరియాలో my home abra, Fortune towers నీ కూడా సందర్శించారు

# మైదుకూరు కేసీ కెనాల్‌లో ట్రాక్టర్ పడి ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి..!!



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 11:

కడపజిల్లా.. మైదుకూరు మండలం శివపురం గ్రామంలో ఒక విషాదకర ప్రమాదం చోటుచేసుకుంది. శివపురం ఎస్సీ కాలనీలోని గంగమ్మ గుడి సమీపంలో తెల్లవారుజామున ప్రాంతంలో ఈ ఘటన జరిగినట్టుగా సమాచారం. ఎలక్ట్రికల్ పనులు చేసుకునే జార్ఖండ్ కార్మికుడు గోపి అనే వ్యక్తి నడుపుతున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు నియంత్రణ కోల్పోయి కర్నూలు-కడప కు సంబంధించిన కేసి కెనాల్‌లో పడిపోయింది. ఈ ప్రమాదంలో గోపి అనే వ్యక్తి నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదవశాత్తు జరిగిన సంఘటన మాత్రమేనని, ప్రాథమిక సమాచారం ద్వారా స్పష్టమైంది. ఈ ఘటనపై మైదుకూరు ఎస్సై చిరంజీవి కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల పూర్తి వివరాలపై దర్యాప్తు జరుపుతున్నారు.

# నెల్లూరు జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు -- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు జిల్లా కలెక్టరేట్(బిఎన్ఎస్):-నెల్లూరు జిల్లాలోని రైతు సోదరులకు సాగు ఇబ్బందులు లేకుండా, ప్రస్తుత ఖరీఫ్ (2026-27) సీజన్‌కు సంబంధించి అన్ని రకాల పంటలకు అవసరమైన యూరియా పంపిణీకి జిల్లా యంత్రాంగం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. జిల్లాలో యూరియా ఎరువుల కొరత ఏమాత్రం లేదని, రైతులు ఎలాంటి ఆందోళన లేదా ఊహాగానాలకు లోనుకాకుండా తమ వ్యవసాయ పనులను నిశ్చింతగా కొనసాగించవచ్చని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.అదేవిధంగా యూరియా నిల్వలు & విక్రయాల అధికారిక వివరాలు తెలియజేస్తూ

జిల్లాలో సాగు అవసరాలకు అనుగుణంగా ఇప్పటి వరకు 34,675.394 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది అని ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి జిల్లాలో 15,778.814 MT నిల్వలు ఉన్నాయి అని

గడిచిన నెల రోజుల్లో 18,896.58 MT యూరియా జిల్లాకు చేరింది.

జిల్లా వ్యాప్తంగా జూన్ 8వ తేదీ నుండి ఏ.పీ.ఏ.ఐ.యం.యస్ యాప్ ద్వారా ఇప్పటివరకు 56,275 మంది రైతులకు 17,321.67 MT యూరియా విజయవంతంగా విక్రయించడమైనది అని తెలిపారు.అదేవిధంగా ఈ నిల్వలను జిల్లా వ్యాప్తంగా అన్ని రైతు సేవా కేంద్రాలు (RSKs), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (PACS), మార్క్‌ఫెడ్ గూడౌన్లు మరియు గుర్తింపు పొందిన ప్రైవేట్ రిటైల్ డీలర్ల వద్ద అందుబాటులో ఉంచబడ్డాయి.రైతులు ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు బస్తాపై ముద్రించిన గరిష్ట చిల్లర ధరను (MRP) తప్పకుండా పరిశీలించాలి. నిర్ణీత ధర కంటే ఒక్క రూపాయి కూడా అదనంగా చెల్లించరాదు అని, కొనుగోలు చేసిన ప్రతిసారీ అధికారిక డీలర్ నుండి తప్పనిసరిగా పాయింట్ ఆఫ్ సేల్ (POS) మెషిన్ ద్వారా వచ్చే రశీదును అడిగి పొందాలి అని తెలిపారు.అదేవిధంగా బ్లాక్ మార్కెట్ మరియు అక్రమ విక్రయాలపై మాట్లాడుతూ

జిల్లాలో ఎవరైనా డీలర్లు లేదా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించినా, MRP ధరల కంటే ఎక్కువ ధరకు విక్రయించినా, లేదా యూరియా నిల్వలను అక్రమంగా వేరే ప్రాంతాలకు మళ్లించినా సహించేది లేదని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా గారు తీవ్రంగా హెచ్చరించారు.

అటువంటి అక్రమాలకు పాల్పడే వారిపై ఎరువుల నియంత్రణ చట్టం -- 1985 (Fertilizer Control Order) చట్టం ప్రకారం కఠిన చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవడమే కాకుండా, వారి వ్యాపార లైసెన్సులను తక్షణమే రద్దు చేస్తామని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిరంతరం తనిఖీలు చేపట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

# డ్రగ్స్ వద్దు బ్రో” -- యువతకు శిక్ష కాదు... సంస్కరణే లక్ష్యం: ఎస్పీ రాహుల్ మీనా



అమలాపురం (బిఎన్ఎస్ ) జూలై 11 : కోనసీమ జిల్లా వ్యాప్తంగా “డ్రగ్స్ నో బ్రో” కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా అమలు చేస్తున్నారు ఎస్పీ రాహుల్ మీనా. గంజాయి సాగు, రవాణా, విక్రయం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూనే, మాదకద్రవ్యాల బారిన పడిన యువతను సంస్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలుస్తోంది. ఇటీవలి కాలంలో జిల్లాలో కొంతమంది విద్యార్థులు, యువత గంజాయి వినియోగానికి అలవాటు పడుతున్నట్లు గుర్తించిన పోలీసులు, వారిని నేరస్థులుగా ముద్ర వేయడం కంటే వారి భవిష్యత్తును కాపాడే దిశగా ముందుకు సాగుతున్నారు.మొదటిసారిగా గంజాయి వినియోగంలో పట్టుబడిన విద్యార్థులు లేదా యువకుల విషయంలో, చట్టపరంగా అవకాశం ఉన్న సందర్భాల్లో, వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించి, తల్లిదండ్రుల సహకారంతో తిరిగి సన్మార్గంలోకి తీసుకురావడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. యువత జీవితాలను నాశనం కాకుండా కాపాడడమే ఈ విధానం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. అదే సమయంలో గంజాయి సాగు, రవాణా, విక్రయం, సరఫరా వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై మాత్రం ఎలాంటి రాజీ లేకుండా కఠిన చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయి. శిక్షతో పాటు సంస్కరణకు ప్రాధాన్యం ఇచ్చే ఈ మానవీయ పోలీసింగ్ విధానాన్ని కోనసీమ ప్రజలు హర్షిస్తున్నారు. యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడుతూ, సమాజాన్ని మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే కోనసీమ పోలీసుల సంకల్పానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది...

# ఈ నెల 13న తూర్పుగోదావరి జిల్లాకు సీఎం చంద్రబాబు రాక...

### ధవలేశ్వరం బ్యారేజ్ కొత్త గేట్లు ఏర్పాటు పనులకు శంఖుస్థాపన చేయనున్న సీఎం...

మండపేట(బిఎన్ఎస్ )జూలై 11:

ఈ నెల 13వ తేదీ సోమవారం తూర్పుగోదావరి జిల్లాకు రానున్న గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండపేట నియోజకవర్గ పరిధిలోని టీడీపీ రైతు నాయకులతో ఎమ్మెల్యే వేగుళ్ళ శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోదావరి డెల్టా రైతాంగ నమ్మకమైన వారధి అయిన సర్ ఆర్థర్ కాటన్ (ధవళేశ్వరం) బ్యారేజీ ఆధునీకరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టడం శుభపరిణామన్నారు. సుమారు రూ.150 కోట్ల భారీ వ్యయంతో 117 కొత్త గేట్ల ఏర్పాటు, 12 హెడ్ స్లూయిస్ గేట్ల మరమ్మతు పనులకు ముఖ్యమంత్రి స్వయంగా శంఖుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల గోదావరి డెల్టా పరిధిలోని ముఖ్యంగా మండపేట నియోజకవర్గంలోని వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీటి సరఫరా మరింత మెరుగుపడుతుందని, రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సోమవారం ఉదయం



ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద జరిగే ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి, ఆ తర్వాత జరిగే సీఎం రైతు ముఖాముఖి సమావేశానికి మండపేట నియోజకవర్గంలోని రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

### వేంపల్లె.. చాగలమర్రి రోడ్డుకు

# మోక్షం ఎప్పుడో

**కాంగ్రెస్ రాజ్యసభ మాజీ సభ్యులు, రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి.**

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జులై 11:

కడపజిల్లా.. వేంపల్లె, చాగలమర్రి రహదారి విస్తరణ పనులకు ఇప్పట్లో మోక్షం లేదా? అని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం వేంపల్లెలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. వేంపల్లె, వీరపునాయునిపల్లి, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, కొర్రపాడు, రాజుపాలెం, చాగలమర్రి జాతీయ రహదారి 440ని రెండు వరుసలు, నాలుగు వరుసల రహదారిగా విస్తరిస్తూ కేంద్ర ప్రభుత్వము 2023- 24 ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేసిందన్నారు. ఈరహదారి పొడవు 78.95 కిలోమీటర్లు. అంచనా విలువ 1321.0 2 కోట్ల రూపాయలు. టెండర్స్ కూడా పిలవడం జరిగింది . ఎన్.ఎస్.పి.ఆర్ కన్స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ టెండర్ దక్కించుకుంది. జిల్లా రెవెన్యూ యంత్రాంగం భూసేకరణ పూర్తి చేయని కారణంగా మూడు సంవత్సరాలు అయిన ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి భూసేకరణ పూర్తి చేయాలని, విస్తరణ పనులు త్వరగా ప్రారంభించాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# జప్తులో ఉన్న ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవాలి

**వరంగల్ ట్రాఫిక్ పోలీసుల విజ్ఞప్తి**



**బిఎన్ఎస్ న్యూస్ వరంగల్, జూలై 11**

కాజీపేట, వరంగల్, హనుమకొండ ట్రై సిటీస్ ప్రాంత ప్రజలకు వరంగల్ ట్రాఫిక్ పోలీసులు కీలక విజ్ఞప్తి చేశారు. కరోనా కాలం నుంచి వివిధ కారణాలతో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో జప్తు చేసి ఉంచిన ద్విచక్ర వాహనాలను సంబంధిత యజమానులు సరైన పత్రాలతో వచ్చి స్వాధీనం చేసుకోవాలని సూచించారు.వాహనాలకు సంబంధించిన ఆర్‌సీ బుక్, బీమా, గుర్తింపు పత్రాలు తదితర అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించి వాహనాలను తీసుకెళ్లవచ్చని తెలిపారు.డ్రంకెన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం లేదా పెండింగ్ చలాన్లు వంటి కేసులు ఉన్నట్లయితే, వాటిని త్వరితగతిన పరిష్కరించుకుని అనంతరం వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు.కాజీపేట, వరంగల్, హనుమకొండ ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న తమ వాహనాలను ఆలస్యం చేయకుండా స్వాధీనం చేసుకోవాలని వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కోదూరి సుజాత విజ్ఞప్తి చేశారు.

## ప్రజలకు వైద్యం అందించకుండా

# ప్రాణాలతో చెలగాటమాడుతున్న వైద్య సిబ్బంది



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 11:

లక్షలకు, లక్షలు జీతాలు తీసుకుంటూ, సామాన్య పేద మధ్య, తరగతి ప్రజలకు వైద్యం అందించాల్సిన సామాజిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు విధులకు సక్రమంగా హాజరుకకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కమలాపురం సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్యులపై చర్యలు తీసుకోవాలని శనివారం కమలాపురం సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద జరిగిన ఆందోళనలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 27న కమలాపురం పట్టణం, సొసైటీ కాలనీకి చెందిన సులోచన అనే మహిళ మృతి చెందడంపై వచ్చిన అభియోగాల నేపథ్యంలో విచారణ జరిగి వారం గడవకముందే గురువారం పట్టణంలో యాక్సిడెంట్లో గాయపడి సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వ్యక్తికి వైద్యం అందించకుండా నిర్లక్ష్యం చేయడంపై సర్వత్ర నిరసన వ్యక్తం అవుతున్నటువంటి నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం పూర్తిస్థాయి విచారణ జరిపించి సంబంధిత డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తూ ప్రైవేట్ క్లినిక్ లు నడుపుతూ విధులకు సక్రమంగా హాజరుకాకుండా వైద్య సిబ్బందిని అడ్డం పెట్టుకొని ఆరోగ్య కేంద్రాలలో పబ్బం గడుపుకుంటున్న వైద్యులను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. వరుస ఘటనలు కమలాపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చోటు చేసుకుంటున్న నేపథ్యంలో స్థానిక శాసనసభ్యులు ఆరోగ్య కేంద్రం అడ్వైజరీ బోర్డు సమావేశాన్ని నిర్వహించి పేదలకు వైద్యం అందే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఒకవైపు జిల్లాలో కరోనా కేసులు నమోదైన నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తం కావాల్సిన అవసరం ఉన్నదని అన్నారు .కేంద్ర ప్రభుత్వం ఒకవైపు ఆయుష్మాన్ భారత్ అని గొప్ప, గొప్ప పేర్లు పెట్టి కోట్ల రూపాయల ఖర్చు చేసి ఆసుపత్రులు నిర్మిస్తుంటే , డబ్బు లేని వైద్యం అందించడమే డబల్ ఇంజన్ సర్కారు ఉద్దేశం అంటూ రాష్ట్ర ప్రభుత్వం గొప్ప, గొప్ప ప్రకటనలకే పరిమితం అవుతున్నది తప్ప నిజానికి పేదలకు వైద్యం అందక ప్రైవేటు వైద్యం కొనలేక ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కమలాపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది వైద్యులపై చర్యలు తీసుకొని సమూలంగా ప్రక్షాళన చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కమలాపురం నియోజకవర్గ కార్యదర్శి జి.నాగేశ్వరరావు, పల్లా వరప్రసాద్, రెడ్డెయ్య, సాదక్ వల్లి, మునిరాజారెడ్డి, రాఘవ, రాయప్ప, పాల్గొన్నారు.

## పుట్టా పోలమ్మ పార్థివ దేహాన్ని దర్శించుకున్న పలువురు ప్రజా ప్రతినిధులు.



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 11:

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాతృమూర్తి దివంగత పుట్టా పోలమ్మ గారి పార్థివదేహానికి ప్రొద్దుటూరులోని ఎమ్మెల్యే పుట్టా నివాసంలో పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, వివిధ పార్టీల ప్రముఖులు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, కమలాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి, కడపజిల్లా టీడీపీ అధ్యక్షులు భూపేష్ రెడ్డి, రాష్ట్ర టీడీపీ నాయకులు సిఎం. సురేష్ నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు లింగారెడ్డి, కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు విజయజ్యోతి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు దివంగత పుట్టా పోలమ్మ పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే దివంగత పుట్టా పోలమ్మ గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

# బీజేపీ లీగల్ సెల్‌లో 146 మంది న్యాయవాదుల చేరిక

## : సామాన్యులకు 'జనతా వారధి' ద్వారా న్యాయ సహాయం

విజయవాడ:ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచ వేదికపై భారతదేశ ఖ్యాతి పెరుగుతుంటే, అది చూసి ఓర్వలేకనే దేశంలోని కొన్ని విచ్ఛిన్నకర శక్తులు సనాతన ధర్మంపై, దేశ అస్తిత్వంపై దాడులకు తెగబడుతున్నాయని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం విజయవాడలో ఏపీ బీజేపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జనతా వారధి -- ఉచిత న్యాయ సహాయం' కార్యశాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ న్యాయస్థానాలకు చెందిన 146 మంది న్యాయవాదులు బీజేపీలో చేరారు. వారికి శ్రీ మాధవ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. విజయవాడ జిఆర్టి హోటల్ లో నిర్వహించిన కార్యక్రమంలో మాధవ్ కీలక అంశాలు ప్రస్తావించారు

**సమావేశంలో శ్రీ పీవీఎన్ మాధవ్ ప్రసంగించిన ముఖ్యాంశాలు:**

**రాష్ట్రంలో కుల చిచ్చు -- ప్రతిపక్షాల తీరు:**

ఆంధ్రప్రదేశ్‌లో కులాల మధ్య విద్వేషాలు రగిల్చేందుకు ఒక పెద్ద బ్రిగేడ్ కుట్ర చేస్తోంది. కొందరు మేధావుల ముసుగులో యూట్యూబ్ ఛానెళ్లు పెట్టి ఇష్టానుసారంగా విద్వేషాలు చిమ్ముతున్నారు.

బ్రిటిష్ వారి గెజిట్ల వల్లే కుల వ్యవస్థ ఏర్పడింది. కానీ, నేడు ఉన్నత విద్యావంతులు సైతం కుల సంఘాలు పెట్టుకోవడం విచారకరం. ఏపీలో ఉన్నన్ని కుల సంఘాలు ప్రపంచంలో మరెక్కడా లేవు.

శ్రీరాముడిని ఎదిరించిన 'రావణ్' పేరు పెట్టుకుని ఉన్మాద కార్యకలాపాలు చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేస్తే, అతనికి సీపీఐ, వైసీపీ నాయకులు వత్తాసు పలుకుతున్నారు. మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు సైతం సీపీఐ వేదికపై కూర్చొని ఆ అరెస్టును తప్పుబట్టడం శోచనీయం. ఇలాంటి దేశ వ్యతిరేక శక్తులకు సపోర్ట్ చేయడం ద్వారా వైసీపీ తమపై తామే 'హిందూ వ్యతిరేకి' ముద్ర వేసుకుంటోంది.

**సామాన్యులకు అండగా బీజేపీ లీగల్ సెల్:**




ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి సోమవారం కలెక్టరేట్లు, ఆర్డీవో ఆఫీసుల వద్ద 'జనతా వారధి' కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోంది.

ప్రజలకు అనవసర లిటిగేషన్లు తగ్గించి, సులభంగా న్యాయం అందించేందుకు ప్రతి శుక్రవారం అన్ని జిల్లా పార్టీ కార్యాలయాల్లో 'ఉచిత న్యాయ సలహా కేంద్రాలు' ఏర్పాటు చేయనున్నాము.

రాష్ట్రంలో ఏడాదిలోనే సైబర్ నేరగాళ్ల చేతిలో ప్రజలు రూ. 480 కోట్లు మోసపోయారు. యువత డ్రగ్స్ బారిన పడుతున్నారు. వీటిపై ప్రజలకు లీగల్ అవేర్నెస్ కల్పించే బాధ్యతను బీజేపీ లీగల్ సెల్ తీసుకుంటుంది.

న్యాయవాదుల రక్షణ చట్టం (Lawyers Protection Act) అమలు లక్ష్యంగా, కేంద్ర న్యాయశాఖ మంత్రి శ్రీ అర్జున్ రామ్ మేఘవాల్ ముఖ్య అతిథిగా నెల రోజుల్లో విజయవాడలో రాష్ట్ర స్థాయి న్యాయవాదుల మహాసభను భారీ ఎత్తున నిర్వహిస్తాము.

దేశానికి, ధర్మానికి వ్యతిరేకంగా పనిచేసే శక్తుల ఆటకట్టించడానికి న్యాయ పోరాటమే మన ఆయుధం కావాలని, జాతీయవాద న్యాయవాదులంతా ఏకం కావాలని శ్రీ పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. ఉగ్రవాద సానుభూతిపరులకు సీపీఐ, వైసీపీ వత్తాసు!

దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ, ఉగ్రవాద సంస్థలకు లీగల్ ఎయిడ్ ఇస్తూ సమాజంలో విద్వేషాలు రగిలిస్తున్న 'రావణ్' అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేస్తే, అతనికి సీపీఐ మరియు వైసీపీ నేతలు మద్దతు పలకడంపై మాధవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏబీ వెంకటేశ్వరరావు వ్యాఖ్యలపై ఆశ్చర్యం: ఒక ఉన్నత పోలీస్ అధికారిగా పనిచేసిన ఏబీ వెంకటేశ్వరరావు గారు నిన్న సీపీఐ పెట్టిన సమావేశ వేదికపై కూర్చొని, ఆ చట్టం తప్పు అని ఏం అర్థమయ్యి మాట్లాడారో ఆయనకే తెలియాలని విమర్శించారు.

వైసీపీకి హిందూ వ్యతిరేకి ముద్ర: "వైసీపీ వాళ్లకు అసలు చదువు ఉందో లేదో అర్థం కావడం లేదు. మీకు కూటమి ప్రభుత్వంపై, చంద్రబాబు నాయుడు గారిపై కోపం ఉంటే పోలవరం డ్యామ్, రాజధాని అమరావతి అభివృద్ధి పనులపై వ్యతిరేకించండి. కానీ దేశ వ్యతిరేక, అనైతిక కార్యకలాపాలు చేసే రావణ్ లాంటి ఉన్మాదులకు సపోర్ట్ చేస్తే.. వైసీపీ 'హిందూ వ్యతిరేక' పార్టీ అనే ముద్రను శాశ్వతంగా వేసుకున్నట్లే అవుతుంది" అని హెచ్చరించారు. ఢిల్లీ జేఎన్‌యూలో "హర్ ఘర్ సే అఫ్జల్ నిక్లేగా", "భారత్ తేరే తుక్డే హోంగే" అన్న దేశద్రోహులను చేర్చుకుంటున్న కాంగ్రెస్, కమ్యూనిస్టుల అసలు స్వరూపాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు.

న్యాయవాదుల కార్యశాలలో బిజెపి రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ మాట్లాడుతూ జాతీయ వాద దృక్పథంతో న్యాయవాదులు పని చేయాలని పిలుపునిచ్చారు. బిజెపి పని చేసే విధానం సోదాహరణగా వివరించారు.

ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు, బిజెపి రాష్ట్ర నేత ఉప్పలపాటి శ్రీ నివాస్ రాజు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు కు న్యాయ వాదులు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ,

లాయర్స్ సెల్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప రెడ్డి,ఓబిసి మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీ నివాస్ , ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, జూపూడి రంగరాజు ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు అడ్డూరి శ్రీ రాం తదితరులు వేదిక ను అలంకరించారు

## ముడియం శ్రీధర్ కుటుంబాన్ని పరామర్శించిన కడప ఆర్డీవో..!



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 11: వియత్నాంలో జరిగిన పడవ ప్రమాదంలో కడపకు చెందిన ముడియం శ్రీధర్ మృతి చెందిన విషయం తెలుసుకున్న వెంటనే జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశాల మేరకు కడప ఆర్డీవో మురళి.. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ ఘటన పట్ల జిల్లా యంత్రాంగం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోందని ఆర్డీవో తెలిపారు. శ్రీధర్ మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురావడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను సమీక్షిస్తున్నామని, మృతుడు శ్రీధర్ వాణిజ్య భాగస్వామ్య కంపెనీ యాజమాన్య ప్రతినిధితో కూడా మాట్లాడి సమన్వయం చేస్తున్నట్లు చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహాయ సహకారాలు అందించి, న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలుపుతూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## అమ్మవారిపాలెం భక్తుల తిరుమల పాదయాత్రకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సంఘీభావం



ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి(బిఎన్ఎస్):- నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం అమ్మవారిపాలెం గ్రామం నుండి తిరుమల శ్రీవారి దర్శనార్థం బయలుదేరిన భక్తుల పాదయాత్ర శనివారం నాటికి మూడవ రోజుకు చేరుకుంది. 250 మంది భక్తులతో ఘనంగా ప్రారంభమైన ఈ 11వ వార్షిక పాదయాత్ర శనివారంఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ పాదయాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. భక్తులకు స్వయంగా మంచినీరు, మజ్జిగ పంపిణీ చేసి తన సంఘీభావాన్ని ప్రకటించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... సుదూర ప్రాంతం నుండి స్వామివారి దర్శనం కోసం కాలినడకన వెళ్తున్న భక్తుల సంకల్పం గొప్పదని కొనియాడారు. భక్తులందరికీ శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, వారి పాదయాత్ర విజయవంతంగా సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పులికల్లు రాజేశ్వరరావు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మియాపూర్ ఫ్లైఓవర్, మైహోమ్ మంగళ RUB పనులను పరిశీలించిన సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ సన్‌ప్రీత్ సింగ్



సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కొనసాగుతున్న మియాపూర్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు, మైహోమ్ మంగళ రైల్వే అండర్ బ్రిడ్జ్ (RUB) పనులను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్. క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, వాటి కారణంగా ట్రాఫిక్‌పై పడుతున్న ప్రభావాన్ని సమీక్షించి, ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు.

అనంతరం NH-65లో మియాపూర్ నుంచి అల్విన్ వరకు సర్వీస్ రోడ్ అభివృద్ధి కోసం ప్రతిపాదించిన ట్రాఫిక్ డైవర్షన్ ప్రణాళికను పరిశీలించారు. డైవర్షన్ అమలు సమయంలో వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ట్రాఫిక్‌ను సురక్షితంగా, అంతరాయం లేకుండా మళ్లించేందుకు అవసరమైన ప్రాంతాల్లో బ్యారికేడ్లు, హెచ్చరిక బోర్డులు, దిశా సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే డైవర్షన్ అమలుకు ముందు ట్రయల్ రన్ నిర్వహించి, లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని అధికారులకు సూచించారు.

నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో ప్రజలకు ఇబ్బందులు తగ్గేలా ట్రాఫిక్ నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్ పోలీసులు, నిర్మాణ సంస్థలు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు.

ఈ పరిశీలనలో డీసీపీ ట్రాఫిక్-II శేషాద్రిని రెడ్డి, డీసీపీ ట్రాఫిక్-I ఎస్. రవికుమార్, అదనపు డీసీపీ ట్రాఫిక్-II టి. హనుమత్ రావు, ఏసీపీ మియాపూర్ ట్రాఫిక్ ఆది మూర్తి, మాధాపూర్ ట్రాఫిక్ విభాగానికి చెందిన అధికారులు, గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, అలాగే జవీజ విభాగానికి చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (EE) అధికారులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు మరణించిన యువ ఉద్యోగి కుటుంబానికి తోటి సిబ్బంది ఆర్థిక సాయం



బిఎన్ఎస్:వికారాబాద్ జిల్లా, పరిగి పరిధిలోని డెనోవా అగ్రి లిమిటెడ్ (సీడ్స్ ఢ పేస్టిసైడ్స్ ప్రైవేట్ లిమిటెడ్) కంపెనీలో పనిచేస్తున్న గంగ్యాడ గ్రామానికి చెందిన శివ అనే యువకుడు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందడం పట్ల తోటి ఉద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గత శుక్రవారం రాత్రి విధులకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శివ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తన సహోద్యోగి అకాల మరణాన్ని జీర్ణించుకోలేకపోయిన డెనోవా అగ్రి కంపెనీ ఉద్యోగులందరూ కలిసి, బాధిత కుటుంబానికి తమవంతు ఆర్థిక భరోసా కల్పించాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు పరిగి కేంద్రంలో శివ కుటుంబ సభ్యులను కలిసి, తమ సానుభూతిని తెలియజేస్తూ పది వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీకి చెందిన పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

## హైదర్గూడలో ముమ్మరంగా

# ఓటరు నమోదు ప్రక్రియ



బిఎన్ఎస్, అత్తాపూర్: కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా హైదర్గూడలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఓటరు నమోదు ప్రక్రియను అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిధిలోని ఐదు పోలింగ్ బూతులకు సంబంధించి కొత్త ఓటరు నమోదుతో పాటు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తులను స్వీకరించారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు ప్రాధాన్యతను వివరిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఆఫీస్ సెక్రెటరీ విజయకుమార్, బి.ఎల్.ఓ చంద్రయ్య, బజరంగ్ రెడ్డిలతో పాటు స్థానిక ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై సీఎం నివాస ముట్టడికి పిలుపునిచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ




బిఎన్ఎస్, హైదరాబాద్: తెలంగాణలో విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను నిరసిస్తూ, ఆమ్ ఆద్మీ పార్టీ (AAP) రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జిల్లోజు ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం వద్ద శాంతియుత "ఇంటి ముట్టడి" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ ప్రకటించింది. ఈ సందర్భంగా హేమా సుదర్శన్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాశాఖకు వెంటనే ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో జాప్యం, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదల, అలాగే నిరుద్యోగ యువతకు ఉద్యోగ నోటిఫికేషన్లు సకాలంలో విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ముఖ్యమంత్రి స్వయంగా విద్యాశాఖను చూస్తున్నప్పటికీ సమస్యలు పరిష్కారం కావడం లేదని విమర్శించారు. ప్రధాన డిమాండ్లలో భాగంగా ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు, పేరెంట్ కమిటీ వివరాలను నోటీస్ బోర్డులపై ప్రదర్శించాలని, విద్యాశాఖలోని ఖాళీలను భర్తీ చేసి, పరీక్షల నిర్వహణలో పారదర్శకతను తీసుకురావాలని కోరారు. "విద్య హక్కు -- నిర్లక్ష్యం కాదు" అనే నినాదంతో నిర్వహించనున్న ఈ నిరసనలో స్టేట్ కమిటీ ట్రెజరర్ సోయల్, స్టేట్ అధికార ప్రతినిధి పరీక్ష రాజ్, రాష్ట్ర నాయకులు బాబూలాల్ పవర్, దర్శనం రమేష్, సి. మల్లికార్జున్ (ఉప్పల్ వార్డు ఇంచార్జ్), పుల్లయ్య (ఖమ్మం జిల్లా), మొహమ్మద్ అజారుద్దీన్ (నిజామాబాద్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు) తదితరులు పాల్గొంటారని ఆమ్ ఆద్మీ పార్టీ పేర్కొంది.